



# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL  ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి  ఆదివారం 22-10-2023  సంపుటి : 06  సంచిక : 49  పేజీలు : 8  వెల : రూ 3-00

# 31న ఏపీ కేబినెట్



విజయవాడ, అక్టోబరు 21, ఏపీ కార్యనిర్వాహణ రాజధానిగా విశాఖను ప్రకటించిన జగన్ సర్కార్... 2024 ఎన్నికల ముందు వేగంగా అడుగులు వేస్తోంది. న్యాయపరమైన అడ్డంకులు ఉన్నా... విశాఖ నుంచి పరిపాలన చేసేందుకు సిద్ధమువుతున్నారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సీఎం నివాసంతోపాటు... ముఖ్యమంత్రి క్యాంప్ ఆఫీసును విశాఖకు తరలించి అక్కడి నుంచే పాలన చేయాలని ప్రయత్నిస్తున్నారు. ఇది ఎప్పటి నుంచో అనుకున్నదే అయినా... అడుగులు మాత్రం ముందుకు పడలేదు. కానీ... ఏడాది నుంచి విశాఖకు షిఫ్ట్ అయ్యేందుకు మాత్రం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు సీఎం జగన్. దసరాకు విశాఖకు వెళ్లిపోవాలనుకున్నారు. కానీ... ఏమైందో ఏమో.. మళ్లీ డిసెంబర్‌కు వాయిదా వేసుకున్నారు. డిసెంబర్‌లో విశాఖకు మారిపోతానని సీఎం జగన్ ప్రకటించారు. ఈసారి మాత్రం విశాఖకు మారడం పక్కా అంటున్నాయి వైసీపీ వర్గాలు. డిసెంబర్‌లో విశాఖకు మారుతానన్న సీఎం జగన్ ప్రకటనతో... ఈ నెలాఖరున జరగనున్న ఏపీ కేబినెట్ భేటీపై కూడా ఆసక్తి రేగుతోంది. మంత్రివర్గ సమావేశంలో ముఖ్యంగా విశాఖకు రాజధాని తరలింపుపైనే చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం. డిసెంబర్‌లో విశాఖకు మారుతున్నట్టు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చెప్పారు. కానీ.. ఏ రోజున అన్నది మాత్రం ఇంకా ఫిక్స్ కాలేదు. ఈ నెలాఖరును జరుగుతున్న కేబినెట్ భేటీలో తేదీపై కూడా క్లారిటీ వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. మరోవైపు... రాజధానిలో వసతులు, సౌకర్యాలపై పరిశీలించేందుకు ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ విశాఖలో పర్యటిస్తోంది. ముఖ్యమంత్రి కార్యాలయం మార్పు, అందుకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలకు సంబంధించి అందుబాటులో ఉన్న భవనాలు, నిర్మాణాలను పరిశీలిస్తోంది. సీఎం కార్యాలయం ఎక్కడ ఉండాలి, ఏ శాఖలు విశాఖకు రావాలి, వస్తే ఆయా శాఖల కార్యదర్శులు, విభాగ అధిపతులు ఎక్కడ ఉండాలి అనేది కూడా కమిటీ పరిశీలిస్తోంది. ఈ కమిటీ కూడా కేబినెట్ భేటీలోగా నివేదిక సమర్పించే అవకాశాలు ఉన్నాయి. దీనిపై కూడా మంత్రివర్గ సమావేశంలో చర్చించనున్నారని సమాచారం. ఇక.. ఈనెల 31న ఉదయం 11 గంటలకు సచివాలయం మొదటి బ్లాక్‌లో ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగనుంది. ఈమేరకు సీఎస్ జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కేబినెట్ సమావేశంలో చర్చించే ప్రతిపాదనలు ఈనెల 27వ తేదీలోపు సాధారణ పరిపాలన విభాగానికి పంపాలని అన్ని శాఖలను ఆదేశించారు.

## ఏపీ హైకోర్టు న్యాయమూర్తులుగా నలుగురి ప్రమాణ స్వీకారం

విజయవాడ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు అదనపు న్యాయమూర్తులుగా నియమితులైన హరినాథ్ నూనెపల్లి, కిరణ్మయి మండవ, సుమతి జగడం, న్యాపతి విజయ్ శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ వీరితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ఏపీ హైకోర్టు సీజే, న్యాయమూర్తులు, సీఎం జగన్, నూతన న్యాయ మూర్తుల కుటుంబసభ్యులు, తదితరులు హాజరయ్యారు. న్యాయవాదుల కోటా నుంచి ఈ నలుగురిని న్యాయమూర్తులుగా నియమించాలని

ప్రమాణ స్వీకారం మహోత్సవంలో పాల్గొన్న గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి.




ఇటీవల సుప్రీంకోర్టు కొలీజియం చేసిన సిఫారసులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదముద్ర వేశారు. కేంద్ర న్యాయశాఖ వీరి నియామ కానికి ఈనెల 18న ఉత్తర్వులిచ్చిన సంగతి తెలిసిందే. ఏపీ హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల పోస్టులకుగానూ ప్రస్తుతం 27 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఇద్దరు ఇతర రాష్ట్రాలకు బదిలీ కాగా, కర్ణాటక నుంచి జస్టిస్ నరేందర్ బదిలీపై ఏపీ హైకోర్టుకు వస్తున్నారు. కొత్తగా నియమితులైన నలుగురితో ఏపీ హైకోర్టులో న్యాయమూర్తుల సంఖ్య 30కి చేరింది.

## పోలీస్ అమరవీరుల దినోత్సవం.. సీఎం జగన్ ట్వీట్



తాడేపల్లి: విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకుంటూ పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నేడు మన ప్రభుత్వం తరపున నిర్వహించాం. ఈ ఏడాది మన రాష్ట్రంలో విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ సోదరుడి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని ఈ సందర్భంగా మాట ఇస్తున్నాను" అంటూ పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు."సమాజ భద్రత కోసం తన ప్రాణాన్ని సైతం త్యాగం చేసేందుకు సిద్ధపడే పోరాట యోధుడే పోలీస్. అధునాతన వ్యవస్థలను ఉపయోగించుకుని నేరాలకు పాల్పడుతున్న వారిని ఎదుర్కోవలసిన బాధ్యత నేటి పోలీసులపై ఉంది. నేర నిరోధం, నేర దర్యాప్తులో మన రాష్ట్ర పోలీసులు అత్యాధునిక సైబర్ టెక్నాలజీని ఉపయోగిస్తూ దేశంలోనే అగ్రగామిగా ఉన్నారు.

## ప్రతీ క్షణం ప్రజలకోసమే పోరాడిన వ్యక్తి చంద్రబాబు

### నారా లోకేశ్ భావోద్వేగం



మంగళగిరి: ఆంధ్రప్రదేశ్ ప్రజల కోసం అహర్నిశలు కష్టపడిన ప్రజా నాయకుడు తెదేపా అధినేత చంద్రబాబు అని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో లోకేశ్ ప్రసంగం గద్గద స్వరంతో సాగింది. ప్రజల కోసం పోరాడిన నాయకుడు చంద్రబాబు అంటూ సమావేశ వేదికపైనే కన్నీరు పెట్టుకున్నారు. తెలుగు దేశం-జనసేన పోరాడకుంటే రాష్ట్రాన్ని జగన్ ముక్కలు చేసి అమ్మేసేవాడని మండిపడ్డారు. తెలుగుదేశం-జనసేన కలిస్తే 160 స్థానాలు ఖాయమని స్పష్టం చేశారు. ఏ తప్పు చేయకున్నా చంద్రబాబును జైల్లో పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డబ్బే సంపాదించాలని చంద్రబాబు భావిస్తే రాజకీయాలు అవసరం లేదన్నారు."2019లో ఒక్క ఛాన్స్ అంటే జగన్‌ను గెలిపించారు. నియంత మాదిరిగా జగన్ రాష్ట్రాన్ని నాశనం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల్లోకి తోసేశారు. సైకో జగన్ మొదటి నిర్ణయం.. ప్రజల కోసం కట్టిన ప్రజావేదిక కూల్చడం. దళితులు, బీసీలు, మైనారిటీలు, అనేకమంది తెదేపా నాయకులపై వేల కేసులు పెట్టించారు. రాష్ట్రానికి చంద్రబాబు అనేక పరిశ్రమలు తీసుకొచ్చారు. వేలమంది నిరుద్యోగ యువతీయువకులకు ఉపాధి కల్పించారు. పరిశ్రమలు తీసుకొచ్చి, ఉద్యోగాలు కల్పించినందుకు చంద్రబాబును జైలుకు పంపించారా? అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసినందుకు చంద్రబాబును బంధించారా? జాబ్ క్యాలెండర్ వెంటనే విడుదల చేయడం ఆయన చేసిన నేరమా? సాగునీటి ప్రాజెక్టులను గాలికొదిలేశారని ప్రశ్నించడం చంద్రబాబు తప్పా? ఇతర రాష్ట్రాల రాజధానులకు దీటుగా మన రాజధాని ఉండాలని అహర్నిశలు కష్టపడినందుకు చంద్రబాబును బంధించారు. రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరడం తప్పా? ఇసుక దోపిడీ, కల్తీ మద్యంపై మాట్లాడడం.. కరెంటు, ఆర్టీసీ ఛార్జీలు, పన్నులు తగ్గించాలని అడగడమే ఆయన చేసిన నేరమా? కుటుంబం గురించి ఒక్క క్షణం కూడా పట్టించుకోకుండా అహర్నిశలు ప్రజల గురించే చంద్రబాబు ఆలోచించారు.

## సామాజిక న్యాయం కోసం బస్సు యాత్ర



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21:-. నంద్యాల ఉదయానంద రెసిడెన్సీలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డి గారి అధ్యక్షతన ఏర్పాటు చేసిన "సామాజిక న్యాయ బస్సు యాత్ర - సన్నాహక రౌండ్ టేబుల్" సమావేశం నిర్వహించారు .ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ,ఉప ముఖ్యమంత్రి అంజాద్ భాషగుమ్మనూరు జయరాం ,నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి , వైకాపా రీజనల్ కోఆర్డినేటర్లు అమర్నాథ్ రెడ్డి , రామసుబ్బారెడ్డి ,ఉమ్మడి కర్నూలు జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వైకాపా అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన కలెక్టర్,ఎస్పీ.



కర్నూలు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 విభారె న్యూస్. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం. దేశ, రాష్ట్ర శాంతి భద్రతల పరిరక్షణలో(01.09.2022 నుండి 31.08.2023) ప్రాణ త్యాగాలు చేసి అమరులైన 188 మంది పోలీసులకు ఘన నివాళులు అర్పించిన పోలీసులు. పోలీసు అమరుల కుటుంబాలకు అండగా నిలవాలి జిల్లా కలెక్టర్. విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరవీరులను స్మరించుకోవడం మన భాధ్యత,వారు చేసిన త్యాగాలు,సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ శ్రీమతి సృజన ఐఏయస్,జిల్లా ఎస్పీ జి. కృష్ణకాంత్ ఐపియస్ లు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సంధర్భంగా శనివారం స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని పేరడ్ మైదానంలో అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించారు. జిల్లా కలెక్టర్,జిల్లా ఎస్పీ, అడిషనల్ ఎస్పీలు స్మృతి పరేడ్ కు హజరై,పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి సృజన ఐఏయస్ మాట్లాడుతూ...విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులను స్మరించు కుంటూ, నివాళులర్పిస్తూ ఈరోజు పోలీసు అమరవీరుల సంస్మ రణ దినోత్సవం జరుపుకుంటున్నాము. దేశ సరిహద్దు భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రాణాలను తృణప్రాయంగా పెట్టి ముందుండే వారిలో ఆర్మీ తర్వాత పోలీసులేనని, అన్ని వ్యవస్థల కంటే పోలీసు వ్యవస్థలో పని చేయడం చాలా కష్టతరం, 24 గంటలు పని చేయాల్సి ఉంటుంది. ఒక సారి ఖాకీ యూనిఫాం వేసిన తర్వాత కమిట్‌మెంట్ దాని (మిగతా 2లో )

## పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21:-యావత్ ప్రపంచం నిద్రపోయినా ప్రజలను కాపాడుకోవడానికి మేల్కొనే ఉండి రక్షించే వ్యవస్థ పోలీస్ వ్యవస్థ ఒక్కటేనని ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ వెల్లడించారు. శనివారం నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, నంద్యాల పార్లమెంట్ సభ్యులు పోచ బ్రహ్మానంద రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే తోగూర్ ఆర్థర్, పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి, మైనార్టీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హాబీబుల్లా, జల వనరుల ప్రభుత్వ సలహాదారు గంగుల ప్రభాకర్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.×ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ మాట్లాడుతూ విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీస్ అమరవీరులను స్మరించుకోవాలన్నారు. సమాజమే కుటుంబంగా భావించి



సొంత కుటుంబాలను కూడా పక్కనపెట్టి నిర్విరామంగా పని చేసే వారి కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ పరిపాలనలో కీలక భాగమైన సామాన్యుల ధన, మాన, ప్రాణ రక్షణలో పోలీసులదే ముఖ్య భూమిక అన్నారు. . నంద్యాల జిల్లాలో పోలీసులకు ప్రత్యేక క్యాంపులు నిర్వహించి విద్య, వైద్య సేవలందించడం అభినందనీయమన్నారు. తన చిన్నతనంలో తన తండ్రి ఆర్మీకి పంపాలనుకుని తమపై ప్రేమ వల్ల పంపలేక పోయిన విషయం తరచూ చెప్పేవారని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. దేశ సేవలో ఒకటైన రాజకీయ రంగం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ (మిగతా 2లో )

# సంపాదకీయం

ఆదివారం 22-10-2023

## ఉందిగా మరో పార్టీ మనకైనా...

అందరికి గుర్తుండే శివలో సాంగ్... మార్చి పోతే సెప్టెంబర్ అంటూ సాంగ్... ఇప్పుడు పొలిటికల్ పార్టీ నేతలు అదే పాట పాడుతున్నారు. ఎన్నికల్లో అభ్యర్థులను ఎంపిక చేయడం పార్టీలకు పెద్ద తలనొప్పి వ్యవహారం. టికెట్ ఆశించే నేతలు ఎక్కువగా ఉండడం, సమర్థత, ఆర్థిక, సామాజిక బలాబలాల ప్రకారం ఆశావహులను వడపోసినా సరే.. చివరకు ఒక్కో సీటు కోసం ఇద్దరు ముగ్గురు నేతలు గట్టిగా పోటీపడుతున్న పరిస్థితులున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో టికెట్ ఆశించి భంగపడ్డ నేతలు తిరుగుబావుటా ఎగరేయడం కూడా రాజకీయాల్లో మనం చూస్తుంటాం. అలాంటి నేతలను తన్నుకుపోయి టికెట్ ఇచ్చేందుకు ఎదురుచూసే పార్టీలు కూడా మనకు తారసపడుతూనే ఉంటాయి. ఇప్పుడు ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇలాంటి చిత్రాలెన్నో కనిపిస్తున్నాయి. ఈ పార్టీలో టికెట్ రాకపోతే.. ఆ పార్టీలో రెడీ అన్న చందంగా పరిస్థితి తయారైంది. షెడ్యూల్ కంటే ముందే కొన్ని స్థానాలకు అభ్యర్థులను ప్రకటించిన మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఈ తరహా వాతావరణం నెలకొంది. అందులో భారతీయ జనతా పార్టీ రెండు విధాలా సవాళ్లను ఎదుర్కొంటోంది. ఓవైపు రెబెల్స్ బెడద.. మరోవైపు సుదీర్ఘకాలంగా సీఎం పీఠంపై ఉన్న శివరాజ్ సింగ్ చౌహాన్ ఎదుర్కొంటున్న సహజ వ్యతిరేకత.. ఆ పార్టీ విజయావకాశాలను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. టికెట్ దొరకనివారిలో అసంతృప్తి సహజమే. ఆశించి భంగపడ్డవాళ్లు తిరుగుబాటు చేయడం కూడా సహజమే అని తేలిగ్గా తీసుకునే పరిస్థితి లేదు. ఆ తిరుగుబాటు ఖరీదు పార్టీ ఓటమి కూడా కావొచ్చు. అందుకే ప్రత్యర్థి పార్టీలో రెబెల్స్‌ను తమ పార్టీ అభ్యర్థులుగా నిలిపేందుకు కొన్ని పార్టీలు ప్రయత్నిస్తున్నాయి. మధ్యప్రదేశ్‌లో ప్రస్తుతం ఇదే జరుగుతోంది. 230 స్థానాలున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికలు రోజురోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. 144 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించిన కాంగ్రెస్ ప్రస్తుతం అధికారంలో ఉన్న శివరాజ్ చౌహాన్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూస్తుండగా, రాష్ట్రంలో మరోసారి గెలుపొంది ప్రభుత్వాన్ని కొనసాగించాలని చూస్తున్న బీజేపీ ఇప్పటివరకు 136 పేర్లను ప్రకటించింది. నవంబర్ 17న ఈ రాష్ట్రంలో పోలింగ్ జరగనుంది. ఇంతలో, చాలా మంది ఆశావహులకు టిక్కెట్లు లభించకపోవడంతో తిరుగుబావుటా ఎగరేస్తున్నారు. బీజేపీ రెబల్స్ కొందరు కాంగ్రెస్ నుంచి టిక్కెట్లు పొందగలిగారు. మరికొందరు ఇంకెవరైనా పిలిచి టికెట్ ఇవ్వకపోతారా అని వేచి చూస్తున్నారు. రెబెల్స్ బెడద కేవలం బీజేపీకి మాత్రమే లేదు. కాంగ్రెస్ సైతం ఇదే పరిస్థితి ఎదుర్కుంటోంది. రెండు పిల్లుల తగవులాటలో కోతి లాభపడ్డట్టు.. ఈ రెండు పార్టీల రెబెల్స్ మీద మాయావతికి చెందిన బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ), అరవింద్ కేజ్రీవాల్ నేతృత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్నేశాయి. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల పార్టీల నుంచి 30 మంది వరకు రెబల్స్ స్వతంత్రులుగా బరిలోకి దిగారు. వారిలో నలుగురు గెలుపొందారు కూడా. మిగతావారిలో చాలా మంది గెలవకపోయినా.. అప్పటి వరకు బీజేపీ ? కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ఉన్న పోటీని ముక్కోణపు పోటీగా మార్చి తమ పార్టీకి చెందిన అభ్యర్థుల ఓటమికి కారణమయ్యారు. అందుకే ఈ సారి రెండు పార్టీలూ రెబెల్స్ అంశాన్ని తేలిగ్గా తీసుకోవడం లేదు. గతానుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈసారి ఎంత జాగ్రత్తగా కసరత్తు చేసినా సరే.. ఇప్పటి వరకు ప్రకటించిన జాబితాలోనే బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీల నుంచి 21 మంది తిరుగుబాటు నేతల పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో 15 మంది బీజేపీ రెబల్స్ కాగా.. అందులో 5 మందికి కాంగ్రెస్ టిక్కెట్లు దక్కాయి. మిగతావారిలో కొందరు నేతలు స్వతంత్రులుగా ఎన్నికల్లో పోటీ చేస్తామని ప్రకటించారు. కాంగ్రెస్‌లో చేరిన ప్రముఖ బీజేపీ తిరుగుబాటు నేతల్లో దతియా నుండి అవధేష్ నాయక్, ముంగావలి నుండి రావ్ యద్వేంద్ర సింగ్ ఉన్నారు. టికెట్ దక్కలేదన్న కారణంతో నేతలు అటు బీజేపీని, ఇటు కాంగ్రెస్ పార్టీని వీడి బయటికొచ్చేందుకు సిద్ధపడుతుండడంతో వారిని బహుజన్ సమాజ్ పార్టీ ఎర్రతివాచీ పరిచి స్వాగతిస్తోంది. తిరుగుబాటు నేతల సొంత ఓటుబ్యాంకుకు బీఎస్పీ ఓటుబ్యాంకు తోడైతే ఫలితాలు తారుమారైనా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదు. రాష్ట్రమంతటా బీఎస్పీకి గెలిచేంత ఓటుబ్యాంకు లేకపోయినా? గణనీయమైన ఓట్ల శాతాన్ని ఆ పార్టీ పొందగల్గుతోంది. ఆ పార్టీకి రాష్ట్రవ్యాప్తంగా సగటున 5-6 శాతం ఓటుబ్యాంకు ఉండగా.. కొన్ని కొన్ని నియోజకవర్గాల్లో అది గరిష్టంగా 20 శాతం వరకు ఉంది. ఈ పరిస్థితుల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల తిరుగుబాటు నేతలు బీఎస్పీకి అస్త్రాలుగా మారతారని ఆ పార్టీ భావిస్తోంది. ఇన్నేళ్లుగా బీజేపీ-కాంగ్రెస్ మధ్య ముఖాముఖి పోరులా కనిపిస్తున్న ఎన్నికలను తిరుగుబాటు నేతలకు బీఎస్పీ టికెట్లు ఇవ్వడం ద్వారా ముక్కోణపు పోటీగా మార్చేలా కనిపిస్తోంది. గతంలో మాదిరిగా ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ రాని పక్షంలో బీఎస్పీ లాభపడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాంగ్రెస్‌లో ఆశించిన ప్రాధాన్యత దక్కడం లేదన్న ఉద్దేశంతో ఆ పార్టీని వీడి, తనతో పాటు మరికొందరిని తీసుకుని 2020లో బీజేపీలో చేరిన జ్యోతిరాదిత్య సింధియాపై అందరి దృష్టి ఉంది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన కమలదళం తరఫున రంగంలోకి దిగనున్నట్టు కథనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇప్పటి వరకు విడుదల చేసిన జాబితాల్లో 2వ జాబితాలో బీజేపీ ఏకంగా ముగ్గురు కేంద్ర మంత్రులు, నలుగురు ఎంపీలను అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దింపినప్పటికీ.. సింధియా పేరు మాత్రం లేదు. కైలాష్ విజయవర్గీయ అసెంబ్లీ ఎన్నికల్లోకి ప్రవేశించడంతో సింధియా రాష్ట్ర రాజకీయాల్లో ఉండకపోవచ్చన్న కథనాలు కూడా మరోవైపు వినిపిస్తున్నాయి.

# పోలీసు అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించిన కలెక్టర్,ఎస్పీ

(మొదటి పేజీ తరువాయి....)

అంతట అదే వస్తుందన్నారు. ప్రజల,ధన, మాన,ప్రాణాలను కాపాడడంలో ఏటువంటి సంకోచం లేకుండా పోలీసులు ముందుకు వెళతారని, అటువంటి పోలీసుల త్యాగాలను గుర్తు చేసుకోవడం, అమరులకు నివాళులు అర్పించడం మనందరి భాధ్యత అన్నారు. ఎక్కడైనా,ఎప్పుడైనా అసాంఘిక శక్తులు ప్రబలినప్పుడు,ప్రజలకు భద్రత కల్పించడానికి మేము ఉన్నామనే భరోసా పోలీసుల ద్వారా ఏర్పడుతుందన్నారు. దేశ సరిహద్దుల్ని ఆర్మీ వారు ఏవిధంగా కాపాడుతున్నారో, దేశంలోని ప్రజలకు ఏటువంటి అసౌకర్యం, అభద్రత భావం లేకుండా బ్రతకాలంటే ముందుగా భరోసా ఇచ్చేది పోలీసులేనని అన్నారు. ఆపోలీసులత్యాగనిరతిని ఈ రోజు మనం గుర్తు చేసుకోవాలసిన అవసరం ఉంది,ఆ భాధ్యత మన అందరి పై ఉంది. పోలీసులకు విధి నిర్వహణలో ఏటువంటి ఇబ్బందులు కలిగినా, పోలీసు అమరవీరుల కుటుంబాలకు అండగా నిలవాల్సిన భాధ్యత పోలీసు వ్యవస్థ, ప్రభుత్వం పై ఆధార పడి ఉందన్నారు. జిల్లా ఎస్పీ జి. కృష్ణ కాంత్ ఐపియస్ మాట్లాడుతూ...1959 అక్టోబరు 21 వ తేదీన భారత్ - చైనా సరిహద్దు లఢఖ్‌లోని హాట్ స్ప్రింగ్ వద్ద పోలీసు పెట్రోలింగ్ పహారాలో ఉన్నటువంటి 10 మంది సి అర్ పి ఎఫ్ జవానుల పై శత్రువులు దాడి చేయగా, ధైర్యసాహసాలతో వారి పై ప్రతిదాడిచేస్తూ పోరాడివీరమరణంపొందారు. వారు ఆ రోజు చేసిన అంతిమ త్యాగాలను గుర్తించి,గౌరవించి,దేశ వ్యాప్తంగా అమరవీరులదినోత్సంను ఈ రోజు జరుపుకుంటూ అమరవీరులకు శ్రద్ధాంజలి నిర్వహిస్తున్నామన్నారు. దేశ,రాష్ట్ర భద్రత,ప్రగతి కోసం పోలీసులు పగలనక, రేయనక విధి నిర్వహణలో ప్రాణాలను తృణప్రాయంగా భావించి ప్రజల శ్రేయస్సుకై ప్రాణత్యాగం చేస్తున్నారు. కోవిడ్ సమయంలో కూడా చాలా మంది పోలీసులు ప్రాణాలను అర్పించారన్నారు. దేశంలో ఏ వ్యవస్థ అయినా విశ్రాంతి తీసుకుంటే వచ్చే నష్టం స్వల్పమేనని,అదే పోలీసు వ్యవస్థ విరామం తీసుకుంటే సమాజంలో అసాంఘిక శక్తులు, అరాచక శక్తులు పెట్రేగిపోతాయన్నారు. ఒక సంవత్సర కాలంలో 01.09.2022 నుండి 31.08.2023 నాటికి దేశవ్యాప్తంగా 188 మంది పోలీసులు వీరమరణం పొందారన్నారు. పోలీసుల సంక్షేమం, ఆరోగ్యం సంబంధించి జిల్లా పోలీసు యంత్రాంగం తరపున అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాము. శాంతిభద్రతల పరిరక్షణలో అన్ని శాఖలను సమన్వయం చేసుకుంటూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు వెళతామన్నారు. అనంతరం దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో వీరమరణం పొందిన 188 మంది పోలీసుల పేర్లను ఎఆర్ డిఎస్పీ ఇలియాజ్ భాషా చదివి వినిపించారు. అందరికి శ్రద్ధాంజలి ఘటిస్తూ, నివాళులర్పించి 2 నిమిషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు మున్సిపల్ కమిషనర్ భార్గవ్ తేజ్, సెబ్ అడిషనల్ ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్ ఐపిఎస్,హోంగార్డు కమాండెంట్ సదరన్ రీజియన్ ఎం. మహేష్ కుమార్,అడిషనల్ ఎస్పీ అడ్మిన్ టి. సర్కార్, డిఎస్పీలు సుధాకర్ రెడ్డి, విజయ శేఖర్, నాగభూషణం, శ్రీనివాసులు, ఇలియాజ్ భాషా,పోలీసు వేల్ఫేర్ డాక్టర్ శ్రీమతి స్రవంతి, సిఐలు, ఆర్ ఐలు, ఎస్సైలు,ఆర్ ఎస్సైలు పాల్గొన్నారు.

## శాకాంబరి, ధనలక్ష్మి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ సుంకులమ్మ అవ్వ.



ఎమ్మిగనూరు అక్టోబర్ 21 విభారె న్యూస్.దసరా నవరాత్రుల్లో భాగంగా ఏడవ రోజు అయిన శనివారం రోజు శ్రీ సుంకులమ్మ అవ్వ దేవాలయంలో ప్రాతః కాలంలోనే శ్రీ సుంకులమ్మ అవ్వకు అభిషేకం, అర్చన, అలంకరణ, తదితర పూజా కార్యక్రమాలన్నీ నిర్వహించి అనంతరం శ్రీ సుంకులమ్మ అవ్వకు శాకాంబరి గాను, ధనలక్ష్మి గాను అలంకరణను గావించారు. పై పూజా కార్యక్రమాలు, అలంకారాలన్నీయు ఆలయ పూజారి నాగరాజు దంపతులు నిర్వహించారు. అనంతరం మహా మంగళహారతిని నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి విరివిగా పాల్గొని అమ్మవారి కృపకు కటాక్షులైనారు. భక్తులకు ప్రసాద వితరణమును గావించారు.

## హామీలు అమలు చేయమంటే.. ఎమ్మెల్యే దాడి చేస్తారా?: బుద్ధప్రసాద్



అవనిగడ్డ: సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ధర్నాకు దిగిన తెదేపా, జనసేన కార్యకర్తలపై వైకాపా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు తన అనుచరులతో కలిసి దాడి చేయడాన్ని మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్ ఖండించారు. వివరణ ఇవ్వాల్సిన ఎమ్మెల్యే.. తాను ప్రజాప్రతినిధిని అనే విషయం మరచి, తన క్రిమినల్ మైండ్‌ని ఉపయోగించి దాడికి పాల్పడ్డారని విమర్శించారు. ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందిని వెళ్లిపొమ్మని చెప్పి వ్యూహాత్మకంగా దాడికి పాల్పడ్డారన్నారు. ఎక్కడికైనా తాను ఒంటరిగా వస్తానని చెప్పే సింహాద్రి రమేష్‌బాబు.. శుక్రవారం కూడా ఒంటరిగా తన కార్యాలయం నుంచి బయటకు వెళ్లి ధర్నా చేస్తున్న వారికి సమాధానం చెప్పలేకపోయారా? అని ప్రశ్నించారు. గతంలో బ్యాంకు లోన్ కట్టమని అడిగినందుకు బ్యాంకు మేనేజర్‌ని బ్యాంకు నుంచి బయటకు లాగి కొట్టిన విషయం, నాగాయలంకలో నాబార్డ్ ఛైర్మన్ ఎదుట స్థానిక ఎంపీ ప్రధాన అనుచరుడిని కొట్టిన విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. అవనిగడ్డలో బంద్ జరగనివ్వకుండా వీధుల్లో పోలీసు కవాతు నిర్వహించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడం సబబు కాదని మండిపడ్డారు. వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేసిన షాపులను బలవంతంగా తెరిపించడం పోలీసులకు తగదని బుద్ధప్రసాద్ హితవుపలికారు. నేరస్థులపై దృష్టి పెట్టాల్సిన పోలీసులు రాజకీయ నాయకులకు వత్తాసు పలుకుతూ ప్రతిపక్షాలపై దృష్టి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవనిగడ్డలో ప్రముఖ వైద్యులు డాక్టర్ కోట శ్రీహరిరావు హత్య జరిగి దాదాపు రెండేళ్లు కావస్తున్నా నేరస్థులను ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు.

## పేదలపై పెత్తందారీ పోకడలంటే ఇవే!: నారా భువనేశ్వరి



అమరావతి: చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ శ్రీకాకుళం నుంచి కుప్పం వరకూ సైకిల్ యాత్ర చేస్తున్న తెదేపా కార్యకర్తపై పుంగనూరులో వైకాపా నాయకుడు రెచ్చిపోయిన ఘటనపై నారా భువనేశ్వరి స్పందించారు.వైకాపా నేత తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "పుంగనూరు ఘటన పెత్తందారీ పోకడలకు నిదర్శనం. రాష్ట్రంలో రౌడీ రాజకీయానికి ఈ దాడి ఒక ఉదాహరణ. బిహార్‌లో కూడా ఇంత అరాచక పరిస్థితులు లేవు. పేదలపై పెత్తందారీ పోకడలు అంటే ఇవే. తెలుగుదేశం అంటే ఒక కుటుంబం. మా నేతలను అక్రమంగా జైలులో పెట్టారని నిరసన కూడా చేయకూడదా? కార్యకర్తలకు సైకిల్ యాత్ర చేసే హక్కు కూడా లేదా? సామాన్యులకు చేసిన అవమానం ప్రజలంతా గమనించారు. ఎల్లకాలం నియంతల పెత్తనం సాగదు. అంతిమ విజయం ప్రజాస్వామ్యానిదే" అని భువనేశ్వరి అన్నారు. ఈనెల 24న భువనేశ్వరి తిరుమల శ్రీవారిని దర్శించుకుని అదే రోజు చంద్రబాబు స్వగ్రామం నారా వారిపల్లికి వెళ్తారని తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో నారా లోకేశ్ వెల్లడించారు. 25న చంద్రగిరి నియోజకవర్గం నుంచి 'నిజం గెలవాలి' కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. చంద్రబాబు అరెస్టు వార్త విని ఆవేదనతో చనిపోయిన కుటుంబాలను ఆమె పరామర్శించనున్నారు.

## పోలీస్ అమరవీరులకు నివాళులు అర్పించిన ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్

(మొదటి పేజీ తరువాయి....)

జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన అవకాశం వల్ల ప్రజా సేవ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నంద్యాల జిల్లా అంటే ఫ్యాక్షన్ ప్రాంతమనే ముద్ర తొలగించుకుని అత్యున్నత పరిపాలన వ్యవస్థ ఉన్న జిల్లాగా అవతరించామని..అందుకు కృషి చేస్తోన్న పోలీసుల సేవలను మంత్రి ప్రశంసించారు. జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తూ ఘనంగా . దేశ సరిహద్దు ప్రాంతాల్లో మిలిటరీ, ఆర్మీ, ఎయిర్ ఫోర్స్ సిబ్బంది తమ కుటుంబాలను త్యాగం చేసి రక్షణ కల్పిస్తున్నారన్నారు. అలాగే దేశ అంతర్గత ప్రాంతాలలో పోలీసులు, పారా మిలిటరీ, స్పెషల్ రిజర్వ్ బృందాలు ప్రజలకు భద్రత కల్పిసత్తూ సేవలందిస్తున్నారన్నారు. పోలీసులు ఖాకీ దుస్తులు ధరించగానే మరింత బాధ్యత పెరిగి క్లోజ్ గా పర్యవేక్షించే ప్రవర్తన కలిగి ఉంటారని కలెక్టర్ తెలిపారు. .జిల్లా ఎస్పీ కె. రఘువీర్ రెడ్డి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరవీరులను స్మరించుకుంటూ ఈరోజు ఘనంగా నివాళులర్పిస్తున్నామన్నారు. 1959, అక్టోబరు 21 న 'భారత్ ? టిబెట్' సరిహద్దుల్లో 10 మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, చైనా సైనికులు భారీ సంఖ్యలో దేశ సరిహద్దులోకి వచ్చి దాడి చేసిన సంఘటనలో అసువులు బాసిన పోలీస్ వీరులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది అక్టోబర్ 21న సంస్మరణ దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. దేశ అంతరంగిక భద్రత కోసం, శాంతి భద్రతలను కాపాడటంలో గత సంవత్సరం ఆగస్టు నుంచి ఈ ఏడాది సెప్టెంబర్ వరకు 188 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోవడం జరిగిందన్నారు . అనంతరం ఇటీవల మార్కెట్ యార్డ్ లో జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన 14 మంది పండ్ల వ్యాపారస్తులకు నష్టపరిహార చెక్కులను మంత్రి అందజేశారు.

## శ్రీ వాసవి మాతను దర్శించుకున్న ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి.



ఎమ్మిగనూరు అక్టోబర్ 21 విభారే న్యూస్.దసరా మహోత్సవం సంధర్భంగా పట్టణంలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత దేవాలయం నందు మూల నక్షత్రం సంధర్భంగా శనివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి మాత దేవినీ సందర్శించి, ప్రత్యేక పూజలను ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి జరిపించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ చీఫ్ పురంధేశ్వరికి ఎంపీ విజయసాయిరెడ్డి కౌంటర్

హైదరాబాద్: పలు కుంభకోణాల కేసుల్లో భాగంగా టీడీపీ అధినేత చంద్రబాబు.. రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. మరోవైపు.. చంద్రబాబు తరఫున పేరుమోసిన లాయర్లు పలు కోర్టులో తమ వాదనలు వినిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. న్యాయాన్ని ఓడించడానికి నారా ఫ్యామిలీ కోట్ల రూపాయలను వెదజల్లుతోందని విమర్శించారు.కాగా, విజయసాయిరెడ్డి ట్విట్టర్ వేదికగా..'న్యాయాన్ని ఓడించడానికి ఓ పక్క కోట్లు వెదజల్లుతూ, పేరుమోసిన లాయర్లతో పిటిషన్ల మీద పిటిషన్లు వేయిస్తూ మరోపక్క న్యాయం గెలవాలని ఆందోళన చేయడం వింతే కదా? మీ దృష్టిలో న్యాయం, ధర్మం, నిజాయితీ అంటే అర్థం ఏమిటి పురంధేశ్వరి గారు?. వేల కోట్ల స్కాములకు పాల్పడిన చంద్రబాబు గారిపై కేసులు పెట్టడం అన్యాయమా?' అని ప్రశ్నించారు.

# రిలాక్స్ మూడ్ లో టీడీపీ సీనియర్లు

కాకినాడ, అక్టోబరు 21, పొత్తు ఉంటుందని పవన్ కళ్యాణ్ చేసిన ప్రకటన.. టీడీపీ నేతల్లో మాంచి ఊపు తెచ్చింది. చంద్రబాబు అరెస్ట్‌తో డీలా పడిపోయిన పార్టీకి ఓ విధంగా పవన్ తన పొత్తు ప్రకటనతో బూస్టప్ ఇచ్చారనే చెప్పాలి. ఇదే సందర్భంలో ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని కొందరు నేతల్లో గుబులు పెరుగుతోంది. ఇప్పుడున్న పరిస్థితుల్లో గోదావరి జిల్లాల్లో జనసేన ఎక్కువ సీట్లు అడిగితే?. చంద్రబాబు కూడా కాదనలేక ఇచ్చేస్తే?. మా పరిస్థితేంటన్నది వారి ఆందోళన. తెలుగుదేశం నేతల్లో ఇదొక రకమైతే? ఇంకో కేటగిరీ వేరే ఉందట. జనసేనతో పొత్తు కుదిరిందనే క్లారిటీ రాగానే? వాళ్ళలో టెన్షన్ పటాపంచలైపోయి? ఫుల్ ఫ్రీ అయిపోయారట. ఇక పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. అసలు ప్రచారానికి వెళ్లకున్నా? లేదంటే, జస్ట్ ఓసారి అలా రౌండ్ కొట్టేసి వచ్చినా చాలు అసెంబ్లీ మైక్ పట్టుకుని అధ్యక్షా అనొచ్చని ఊహల్లో తేలిపోతున్నారట.ఇంకా చెప్పాలంటే అసలు నామినేషన్ వేసి తడి గుడ్డేసుకుని కూర్చోవచ్చంటూ రిలాక్స్ మోడ్‌లోకి వెళ్ళిపోయారట. జనసేనతో పొత్తు కుదిరినా?.మాకున్న సీనియారిటీ, టీడీపీ అధినాయకత్వం దగ్గరున్న పలుకుబడి దృష్ట్యా? సీటుకేం ఇబ్బంది ఉండదనే భావనతో ఉన్నారు కొందరు సీనియర్ నేతలు. అలా టిక్కెట్ వస్తుంది?. టీడీపీ, జనసేన బలంతో ఈజీగా గెలిచేస్తాం? ఇక కష్టపడటం, డబ్బులు ఖర్చు పెట్టుకోవడం ఎందుకనుకుంటూ? చివరికి పార్టీ కార్యక్రమాలతో కూడా సంబంధం లేనట్టుగా?. హాయిగా కాలు మీద కాలేసుకుని కాలక్షేపం చేసేస్తున్నారట. ఇటీవల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సీఎం పర్యటన చేసినా?. అస్సలు పట్టించుకోలేదట సదరు నాయకులు. తమ జిల్లాకు సీఎం వచ్చారు.. ఆయనేం కామెంట్లు చేస్తారు..? దానికి మనమేం కౌంటర్ వేయాలన్న ధ్యాసే లేకుండా అదో మాదిరిగా వ్యవహరించారట ముందస్తు గెలుపు కలల్లో మునిగిపోయిన టీడీపీ సీనియర్ నాయకులు. ఈ వ్యవహారశైలి మిగిలిన నేతలతో పాటు పార్టీ ముఖ్యులకు మంటపుట్టిస్తోందట.వీళ్ళని చూసి అంతా ఇలాగే అనుకుంటే ? పరిస్థితి ఏమైపోతుంది? పుట్టి మునగదా అని తలలు కొట్టుకుంటున్నారట. జనసేనతో పొత్తు కుదిరినంత మాత్రాన.. పార్టీ పరంగా మనం చేయాల్సిన కార్యక్రమాలను చేయకుండా, ప్రజల్లోకి వెళ్లకుండా ఇంట్లో కూర్చుంటే గెలిచేస్తామా అని మండిపడుతున్నారట ముఖ్య నేతలు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియదు కదా? అలాంటప్పుడు ఈ వ్యవహార శైలితో బయటికి తప్పుడు సంకేతాలు వెళ్తాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారట. ఓవరాక్షన్ చేస్తే? ఓడించడానికి కూడా జనం వెనకాడబోరన్న వాస్తవాన్ని గుర్తెరిగి మసలుకుంటే మంచిదంటూ సదరు నేతలకు స్వీట్ వార్నింగ్ ఇస్తున్నారట టీడీపీ మిగతా నేతలు. ఈ తరహాలో ఓవర్ కాన్ఫిడెన్స్‌తో ఉన్న నేతల వ్యవహార శైలిని కొందరు పార్టీ అధినాయకత్వం దృష్టికి తీసుకెళ్లినట్టు తెలిసింది. ప్రస్తుతం చంద్రబాబు అరెస్ట్.. న్యాయపోరాటం వంటి వాటిల్లో అగ్రనేతలు బిజీగా ఉండడంతో? కొన్నాళ్లు ఆగండి తర్వాత వాళ్ళ సంగతి చూద్దామని వాయిదా వేసినట్టు తెలిసింది. హడావిడి తగ్గి రొటీన్‌లో పడ్డాక ఓవర్ కాన్ఫిడెన్స్ లీడర్లకు చాకిరేవు పెట్టే అవకాశం ఉందంటున్నారు.

# సీట్ల లెక్కల్లో జనసేన

ఏలూరు, అక్టోబరు 21,జనసేన ఎన్నికలకు సిద్ధమవుతుంది. తెలుగుదేశం పార్టీతో పొత్తును ప్రకటించిన తర్వాత పవన్ కొంత స్పీడ్ పెంచారు. నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించడమే కాకుండా కమిటీలో కొత్తవారికి చోటు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే తాము ఏ ఏ స్థానాల్లో పోటీ చేస్తామన్న దానిపై పవన్ కల్యాణ్‌కు ఒక స్పష్టత ఉందని తెలుస్తోంది. అందులో భాగంగానే అక్కడ ఇన్‌ఛార్జులను నియమిస్తూ పార్టీ బలోపేతానికి పనిచేయాలని నేతలను ఆదేశిస్తున్నట్లు తెలిసింది.చాలా రోజుల తర్వాత మంగళగిరి వచ్చిన పవన్ కల్యాణ్ పార్టీ నేత నాదెండ్ల మనోహర్ తో సమావేశమయ్యారు. త్వరలోనే టీడీపీ, జనసేన పొత్తుల మధ్య చర్చ జరగనున్న నేపథ్యంలో సీట్ల పంపకంపై కూడా వీరిద్దరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది. సీట్లు తాము వదిలేసుకున్న నియోజకవర్గాలకు చెందిన నేతలతో ముందుగానే పిలిచి పవన్ మాట్లాడుతున్నట్లు చెబుతున్నారు. పార్టీ అధికారంలోకి వస్తే ఏదో ఒక పదవి ఇస్తామని హామీ ఇస్తున్నారు. నెల్లూరు పట్టణ నియోజకవర్గం టీడీపీకే వదిలేస్తున్నట్లు అక్కడి నేతకు ముందుగానే చెప్పడం అంటే మూడు నెలల ముందే పవన్ పొత్తుపై ఒక స్పష్టత ఉన్నట్లు అర్థమవుతుంది. తాజాగా ఉంగుటూరు, ఉండి నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులను నియమించారు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని ఈ రెండు నియోజకవర్గాల్లో జనసేన పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు స్పష్టమవుతుంది. అందుకే అక్కడ నియోజకవర్గ ఇన్‌ఛార్జులను నియమించారు. పొత్తులో భాగంగా ఈ రెండు స్థానాలను జనసేన దక్కించుకునే అవకాశముంది. ఉంగుటూరు నియోజకవర్గంలో టీడీపీ నుంచి గన్ని వీరాంజనేయులు గతంలో ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు ఈసారి జనసేన నుంచి ముప్పు పొంచి ఉన్నట్లేనని అనుకోవాల్సి ఉంటుంది. గత ఎన్నికల్లో ఇక్కడ వైసీపీ విజయం సాధించింది. ఈసారి ఇక్కడి నుంచి జనసేన పోటీ చేయాలని భావిస్తున్నట్లుంది. ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా పత్సమట్ల ధర్మరాజును నియమించారుఇక అదే జిల్లాలోని మరో నియోజకవర్గంలోని ఉండి పైన కూడా జనసేన కన్నేసినట్లే కనపడుతుంది. ప్రస్తుతం ఉండిలో టీడీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఉన్నారు. మంతెన రామరాజు ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఉండిలో జనసేనకు పట్టుంది. అందుకే ఈ నియోజకవర్గాన్ని కూడా తాము పొత్తులో భాగంగా తీసుకోవాలన్న నిర్ణయానికి వచ్చినట్లుంది. ఇక్కడ ఇన్‌ఛార్జిగా జుత్తిగ నాగరాజును పవన్ నియమించారు. జనసేన ఎక్కువగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లోనే పోటీకి ఉత్సాహం చూపుతుంది. అందుకే ముందుగానే ఇన్‌ఛార్జులను నియమిస్తూ పవన్ ఒకింత స్పీడ్ పెంచారంటున్నారు జనసేన పార్టీ నేతలు. మరో వైపు సిట్టింగ్‌లందరికీ టీడీపీ టిక్కెట్ ఇస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. మరి పొత్తులో ఈ సీట్లను జనసేన ఎలా దక్కించుకుంటుందన్నది చూడాల్సి ఉంది.




# 23న టీడీపీ, జనసేన సమన్వయ కమిటీ తొలి భేటీ

విజయవాడ, అక్టోబరు 21, టీడీపీ, జనసేన సంయుక్త కార్యాచరణ కమిటీ తొలిభేటీ ఈనెల 23న జరగనుంది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో నారా లోకేశ్, పవన్ కల్యాణ్ అధ్యక్షతన ఈ సమావేశం ఏర్పాటు చేయనున్నారు. ఉమ్మడి పోరాటం, పార్టీల సమన్వయంపై కమిటీ చర్చించనుంది. ఇప్పటికే ఇరు పార్టీలు సంయుక్త కార్యాచరణ కమిటీ సభ్యులను ప్రకటించాయి. ముఖ్యమంత్రి పదవి కంటే తనకు ప్రజల భవిష్యత్తే ముఖ్యమని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి పదవి తీసుకోవడానికి నేను పూర్తి సుముఖంగా ఉన్నానని అన్నారు. వైసీపీని గద్దె దించే రాజకీయ ప్రయాణంలో ముఖ్యమంత్రి పదవి తీసుకునే అవకాశం వస్తే దాన్ని కచ్చితంగా స్వీకరిస్తానని, అయితే దాని కంటే ముందు తనకు రాష్ట్ర భవిష్యత్తు, ప్రయోజనాలే ముఖ్యమని చెప్పారు. '2024లో సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీని అధికారం నుంచి దూరం చేసి జనసేన- తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడేలా ప్రతి కార్యకర్త బలంగా పనిచేయాలి. ఈ ప్రయాణంలో ముఖ్యమంత్రి పదవి చేపట్టడానికి నేను సుముఖంగానే ఉంటాను. అంతకంటే ముందు రానున్న ఎన్నికల్లో వైసీపీని తరిమికొట్టి రాష్ట్ర భవిష్యత్తును తీర్చిదిద్దడానికి అధిక ప్రాధాన్యం ఇస్తాను. దశాబ్దకాలంగా జనసేన రాజకీయ ప్రయాణంలో నాతో కలిసి నడిచిన, పార్టీ అభ్యున్నతి కోసం ఎల్లవేళలా కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు' అని చెప్పారు 'ప్రతికూల పరిస్థితుల్లోనే ఓ మనిషి అసలు స్వరూపం బయటపడుతుందని చెబుతారు. పార్టీ ప్రతికూల పరిస్థితుల్లో నా వెంట నిలిచిన వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. పార్టీలోకి రాగానే అధికారం, పదవులు వస్తాయని చాలా మంది భావించారు. వారంతా తర్వాత కాలంలో వెళ్లిపోయారు. అయితే ఎలాంటి పదవులు లేకున్నా, అధికారంలోనూ లేకపోయినా నాతో పాటు కలిసి నడిచి, పార్టీ కోసం పనిచేసిన వారు ఎందరో ఉన్నారు. వారి సేవలు, వారిని నిత్యం గుర్తుపెట్టుకుంటాను. 2024లో సమష్టిగా రాష్ట్ర బాగు కోసం, వైసీపీని తరిమికొట్టడం కోసం పని చేయాల్సిన అవసరం ఉంది. 'చిన్న చిన్న ఇబ్బందులు ఉంటే అధిగమించి పని చేద్దాం. రాష్ట్ర భవిష్యత్తు కోసమే వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీతో కలిసి వెళ్తున్నామనేది అంతా గుర్తుపెట్టుకోవాలి' అని అన్నారు.'జనసేన పార్టీకి కళ్లు, చెవులు క్రియాశీలక కార్యకర్తలే. పార్టీ నిర్ణయాలను అందరితో చర్చించిన తర్వాతే నేను నిర్ణయం తీసుకుంటాను. కేవలం 150 మంది సభ్యులతో మొదలైన జనసేన ప్రస్థానం నేడు 6.50 లక్షల క్రియాశీలక సభ్యులకు చేరింది. ప్రతిరోజూ కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతూ నాదెండ్ల మనోహర్ పార్టీకి వెన్నెముకగా పనిచేస్తున్నారు. ఆయనకు నా ప్రత్యేక ధన్యవాదాలు. వచ్చే ఎన్నికల్లో జనసేన-తెలుగుదేశం పార్టీ విజయం రాష్ట్రానికి కచ్చితంగా ఓ దిశానిర్దేశం చూపేలా ఉండబోతోంది. పార్టీకి సంబంధించిన 12 కమిటీల్లో రాష్ట్ర కార్యవర్గం 200 పైచిలుకు సభ్యులు అయ్యారు. నూతనంగా రాష్ట్ర కార్యవర్గంలో చేరిన ప్రతి ఒక్కరికీ నా హృదయపూర్వక అభినందనలు. పార్టీ కోసం మరింత కష్టపడి పనిచేయాలి' అని పార్టీ శ్రేణులను కోరారు. ఇంగ్లీష్ భాష నేర్చుకుంటే అద్భుతాలు జరిగితే అమెరికాలో పేదలే ఉండకూడదు. బ్రిటన్, న్యూయార్క్ వంటి దేశాల్లో ఎవరూ రోడ్ల వెంట తిరిగేవారు కాదు. ఐబీ సిలబస్ పెట్టడం వెనుక వేరే కుంభకోణం ఉంది. ఒప్పందం జరిగిన తర్వాత ఏదైనా తేడా వస్తే మనం స్విట్జర్లాండ్‌లో కోర్టుకు వెళ్లి దావా వేయాలి. వీటిపై మంత్రి బొత్స సమాధానం చెప్పాలి. దేశంలో ఐబీ సిలబస్ స్కూళ్లు 1200 మాత్రమే ఉన్నాయి. ఐబీ సిలబస్ వెనక తప్పకుండా స్కాం ఉంది. జనసేన టీడీపీ ప్రభుత్వం వచ్చాక విచారణ జరిపిస్తాం' అని పవన్ కల్యాణ్ అన్నారు.

# పల్నాడులో నీటి ఎద్దడి

గుంటూరు, అక్టోబరు 21, ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు ప్రాజెక్ట్ లు కూడా పూర్తి స్థాయిలో నిండలేదు. దీంతో సాగు నీటి కష్టాలు రైతులకు ప్రారంభమయ్యాయి. విత్తనం నాటిన దగ్గర నుండే నీటి కష్టాలు మొదలయ్యాయి. అయితే వ్యవసాయం తప్ప మరొకటి చేతగాని అన్నదాతలు అటు వాన దేవుడిపై భారం వేసి పంటలు సాగు చేయడం మొదలె పెట్టారు. అయితే ప్రభుత్వం కూడా నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ కింద వరి సాగు చేయవద్దని ఇప్పటికే ప్రకటించింది. కేవలం ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేయాలని సూచించింది. అయితే వరి వేయడం వదులుకున్న రైతులు మిర్చిని సాగు చేస్తున్నారు. గత రెండేళ్లలో మిర్చి ధరలు బాగుండటంతో రైతులు దిగుబడి తగ్గినా ధర భాగుంటే ఎంతో కొంత మేర ఆదాయం చేతికొస్తుందన్న ఆశతో మిర్చిని వేశారు.గత కొన్ని రోజులుగా పల్నాడు ప్రాంతంలో వాన దేవుడు ముఖం చాటేశాడు. మొక్కలు నాటిన తర్వాత వర్షాలు లేకపోవడం మరొకవైపు సాగర్ కాలువలు రాకపోవడంతో సాగు నీటి కష్టాలు ప్రారంభమయ్యాయి. దీంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అనేక కష్టాలు పడుతున్నారు. పల్నాడు జిల్లా బెల్లంకొండలో సాంబయ్య అనే రైతు మిర్చి పంటను కాపాడుకునేందకు చేసిన ప్రయత్నం సాగు నీటికి ఎంత కొరత ఏర్పడిందో అర్థమవుతుంది. సమయానికి బోరు నుండి కూడా నీరు పొలానికి పెట్టలేకపోవడంతో పంట ఎండి పోతుంది. దీంతో ఆ మొక్కలను బ్రతికించుకునేందుకు సాంబయ్య మరొక మహిళ రెండు బిందెలతో నీటిని తీసుకొని ఒక్కో గ్లాసు నీళ్లను ప్రతి మొక్కకు ప్రోస్తున్నారు. ఇది ఒక్క సాంబయ్య పరిస్థితే కాదు రైతులు బోర్ల కింద సాగు చేస్తున్నా సకాలంలో తమ వంతు రావడం లేదు. దీంతో ముందుగా మొక్కలను కాపాడుకునేందుకు గ్లాసులతో నీటిని పోస్తున్న పరిస్థితి కనిపిస్తుంది.ప్రభుత్వం ఆరుతడులకు నీటిని ఇస్తానని చెప్పడంతోనే మిర్చి సాగు చేశామని రైతులు అంటున్నారు. ప్రస్తుతం ఇంకా సాగర్ కాలువల పరిధిలో సాగునీటిని విడుదల చేయడం లేదు.

# పొమ్మనకుండా పొగబెడుతున్నారా

ఒంగోలు, అక్టోబరు 21, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి వ్యవహారం వైఎస్ఆర్‌సీపీలో కలకలం రేపుతోంది. సీఎం జగన్ కు దగ్గర బంధువు అయినప్పటికీ ఆయనకు పార్టీలో అవమానాలు ఎదురవుతున్నాయి. మూడు రోజుల క్రితం ప్రకాశం జిల్లాలో పోలీసుల తీరుని నిరశిస్తూ గన్‌మెన్‌లను బాలినేని శ్రీనివాస రెడ్డి సరెండర్ చేశారు. హైదరాబాద్ నుంచి పోలీసు ఎస్కార్ట్ వాహనం, గన్ మెన్‌లు లేకుండానే తాడేపల్లికి బాలినేని వచ్చారు. ధనుంజయ రెడ్డితో భేటీ అయ్యారు. తర్వాత సీఎం జగన్ను కలిశారో లేదో స్పష్టత లేదు కానీ.. తన విషయంలో ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అవమానామాలపై అసహనం వ్యక్తం చేసినట్లుగా తెలుస్తోంది. మంత్రి పదవి కోల్పోయినప్పటి నుంచి వైసీపీలో ప్రాధాన్యత తగ్గిందనే భావనలో బాలినేని ఉన్నారు. పార్టీలో, ప్రభుత్వ అధికారుల వద్ద తన మాటకి విలువ లేకుండా పోయిందని సన్నిహితుల వద్ద బాలినేని అసహనం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది.ఒంగోలులో ఇటీవల నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాల స్కాం వెలుగు చూసింది. ఇందులో నిందితులు బాలినేని అనుచరులన్న ప్రచారం జరిగింది. ఇదంతా బాలినేని కనుసన్నల్లో జరిగిందని చెప్పుకోవడం ప్రారంభించారు. దీంతో ఆయన తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఒంగోలులో జరిగిన భూ కబ్జాను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. తన రాజకీయ జీవితంలో ఇంతటి క్షోభకు ఎప్పుడూ గురి కాలేదని తెలిపారు. తనకు తెలియకుండా భూ కబ్జా జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. భూ కబ్జా దోషులను పట్టుకోవాలని,. తన అనుచరులు ఉన్నా చర్యలు తీసుకోవాలని ధనుంజయ్ రెడ్డికి తెలిపారు. ఈ కేసులో నిష్పక్షికంగా వ్యవహరించాలని ప్రకాశం జిల్లా కలెక్టర్, ఎస్పీలను ఆదేశించాలని ధనుంజయ్ రెడ్డిని ఎమ్మెల్యే బాలినేని కోరినట్లుగా తెలుస్తోంది. బాలినేని.. సీఎం జగన్ మోహన్ రెడ్డికి ఆప్తుడు, దగ్గర బంధువు. అయితే ప్రకాశం జిల్లాలో చక్రం తిప్పుతున్న మరో నేత వైవీ సుబ్బారెడ్డి కూడా బంధువే. పార్టీలో తగిన గౌరవం లేకపోవడం.. బాధను వెళ్లగక్కుతూ అల్టిమేటం జారీచేయడం.. ఇంతలోనే తాడేపల్లి నుండి పిలుపు రావడం కామన్ గా జరుగుతోంది. ఇటీవల బాలినేని ముఖ్య అనుచరులైన భవనం శ్రీనివాసరెడ్డి, పెద్దిరెడ్డి సూర్యప్రకాశ్ రెడ్డిని పార్టీ సస్పెండ్ చేసింది. వీరిద్దరూ పర్చూరు, మార్కాపురం నియోజకవర్గాల్లో కీలకంగా వ్యవహరిస్తూ ఉంటారు. బాలినేనికి కనీసం సమాచారం కూడా ఇవ్వకుండానే వీరిని సస్పెండ్ చేశారు. ఈ చర్యలపై బాలినేని తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. తనకు కనీస సమాచారం ఇవ్వకుండా ఎలా సస్పెండ్ చేస్తారని ప్రశ్నించిన బాలినేని.. 48 గంటల్లోగా తన అనుచరులను తిరిగి పార్టీలోకి తీసుకోకపోతే డైరెక్ట్ గా జగన్ ను కలుస్తానని హెచ్చరిక లాంటి ప్రకటన చేశారు. కానీ ఎవరూ పట్టించుకోలేదు. ఒంగోలు ఎంపీ మాగుంట, బాలినేని శ్రీనివాసులరెడ్డి ఇప్పుడు కలిసి రాజకీయాలు చేస్తున్నారు. మాగుంట శ్రీనివాసరెడ్డి తన కొడుకుకు రాజకీయ భవిష్యత్ ఇవ్వాలనుకుంటున్నారు అనూహ్యంగా ఆయన జైలుకెళ్లారు. ఈ సమయంలో వైసీపీ నుంచి జగన్ రెడ్డి నుంచి కనీస సపోర్ట్ రాలేదన్న అసంతృప్తిలో ఉన్నారు. అయితే మాగుంట మాత్రం ఎప్పుడూ బయటపడలేదు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడు పోటీ చేస్తారని చెబుతున్నారు. జగన్ మోహన్ రెడ్డి టిక్కెట్ ఇస్తారో లేదో ఎప్పుడూ స్పష్టత ఇవ్వలేదు. అయితే బాలినేని మాత్రం? మాగుంట కొడుకే పోటీ చేస్తారని చేస్తున్నారు. తాను అసెంబ్లీకి మాగుంట పార్లమెంట్ కు పోటీ చేస్తారని ప్రకటిస్తున్నారు పార్టీలో తమకు ఎదురవుతున్న పరిస్థితులపై వారిద్దరూ రగిలిపోతున్నారు. బాలినేని మరి ఏ పార్టీలోకి వెళ్లలేరు. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక జగన్ తొలి కేబినెట్ లో స్థానం దక్కినా, మలి క్యాబినెట్ లో పదవి పోయిన తరువాత వైసీపీలో బాలినేనికి ప్రాధాన్యత సంగతి అటుంచి కనీస గౌరవం కూడా లేకుండాపోయింది. పార్టీలో పరిస్థితి అలా ఉంటే.. కనీసం ఎమ్మెల్యే అన్న గౌరవం కూడా అధికారులు ఇవ్వడం లేదు. ఆఖరికి పోలీసులు, ఎమ్మార్వోలు, ముఖ్య అధికారుల బదిలీల విషయంలో ఆయనకు కనీస సమాచారం ఉండటం లేదు. అందుకే ఆయన ఉక్కపోతను ఎదుర్కొంటున్నారు. పార్టీ మారలేని పరిస్థితి ఆయనది.

## యువతలో దేశ భక్తి ని పెంపొందిస్తున్న నెహ్రూ యువ కేంద్ర

### ఐక్యమత్యానికి నిదర్శనం నా దేశం నా మట్టి

### బద్వేలు రాచపూడి నాగభూషణం డిగ్రీ కాలేజ్ జరిగిన నా మట్టి నా దేశం కార్యక్రమంముఖ్య అతిధులు. ఆర్డీవో ఎ.వెంకట రమణ లెఫ్టినెంట్ కర్నల్. వినయ్ చంద్రన్

బద్వేలు,నా దేశం నా మట్టి అద్భుతమైన కార్యక్రమం అని ప్రతి ఒక్కరిలోనూ దేశభక్తిని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని బద్వేలు రెవిన్యూ డివిజనల్ అధికారి ఆకుల. వెంకటరమణ అన్నారు. భారత ప్రభుత్వ కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వ శాఖ ,నెహ్రూ యువ కేంద్ర,హెచ్.ఎ.ఆర్.డి.ఎస్. సంస్థ ఆధ్వర్యంలో బద్వేలు పట్టణంలో నా దేశం నా మట్టి కార్యక్రమం బద్వేలు నాగభూషణం డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో నిర్వహించారు. విద్యార్థులు, యువత జాతీయ జెండాలు పట్టుకొని నినాదాలు చేస్తూ బారీ ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ంత్ర దేశం నా మట్టి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమన్నారు.

# చలానా స్కామ్ లో మాజీ డీజీపీ అల్లుడు

విజయవాడ, అక్టోబరు 21, కోట్లాది రుపాయల ట్రాఫిక్ చలాన్ల సొమ్మును సొంత ఖాతాలకు మళ్లించుకున్న వ్యవహారంలో మాజీ డీజీపీ అల్లుడిపై కేసు నమోదైంది. ఏపీలో సంచలనం సృష్టించిన వ్యవహారంలో పోలీసుల తీరుపై విమర్శలు రావడంతో కేసు వివరాలను బయట పెట్టారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ప్రకటించారు.ఏపీ ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వాహన చోదకులు పోలీసు శాఖకు చెల్లించిన జరిమానాలను దారి మళ్లించిన కేసులో మాజీ డీజీపీ అల్లుడుతో పాటు పలువురిపై గుంటూరు జిల్లా తాడేపల్లిలో కేసు నమోదైంది. ఈ కేసులో కీలక సూత్రధారి కొమ్మిరెడ్డి అవినాశ్ పరారీలో ఉన్నట్లు ప్రకటించారు.ఏపీ పోలీసుశాఖను మోసం చేసి రూ.40 కోట్ల రుపాయలు దోచుకున్న మాజీ డీజీపీ అల్లుడి వ్యవహారంలో ఎట్టకేలకు పోలీసులు స్పందించారు. ఈ వ్యవహారం వెలుగు చూడటంతో నిందితులపై కేసు నమోదు చేశారు. ఏకంగా పోలీసులకే బురిడీ కొట్టించిన వ్యవహారంపై పోలీసు ఉన్నతాధికారులు మౌనం వహించడంపై విమర్శలు వచ్చాయి.చిన్నాచితక కేసులకు హడావుడి చేసే పోలీసులు కోట్లాది రుపాయలు దోచుకున్న ఘటనలో మౌనం వహించడంపై సందేహాలు తలెత్తాయి. ఈ వ్యవహారంపై మీనమేషాలు లెక్కించిన పోలీసులు చివరకు గుంటూరు జిల్లా తాడేపల్లి పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు చేశారు. డేటా ఎవాల్వ్ సంస్థతో పాటు దాని సీఈవో కొమ్మిరెడ్డి అవినాశ్, కొత్తపల్లి రాజశేఖర్, మరికొందరిని ఈ కేసులో నిందితులుగా చేర్చారు.నిందితులపై ఐపీసీ 409 నేరపూరిత విశ్వాసఘాతుకం, ఐపీసీ 420 సెక్షన్లతో పాటు ఐటీ చట్టంలోని సెక్షన్ 65 కింద వీరిపై అభియోగాలు మోపారు.ట్రాఫిక్ చలాన్ల చెల్లింపుల మోసం కొన్ని నెలలుగా పోలీసుశాఖలో అంతర్గతంగా దర్యాప్తు జరుగుతోంది. సెప్టెంబర్ నెలలోనే కేసు నమోదైనా.. బయటకు రానీయకుండా తొక్కిపెట్టారు.తాడేపల్లిలో కేసు నమోదైన తర్వాత కేసు వివరాలను ఐజీ పాలరాజుఅధికారికంగాప్రకటించారు. చలానా కుంభకోణంలో రూ.36.52 కోట్లు దుర్వినియోగం అయినట్టు చెప్పారు. కొమ్మిరెడ్డి అవినాష్‌కు చెందిన రేజర్ పీఈ ఖాతాకు మళ్లించినట్లు గుర్తించామన్నారు.పీఈ ఖాతా నుంచి డీజీ ఖాతాకు నగదు జమ కాలేదన్నారు. నాలుగేళ్లకు పైగా నగదు దారి మళ్లిస్తున్నట్లు చెప్?పరు. నిధుల మళ్లింపు విషయాన్ని సెప్టెంబర్‌లో తిరుపతి యూనిట్‌లో గుర్తించామని, డేటా సొల్యూషన్స్ నిర్వాహకుడు అవినాష్‌ను సంజాయిషీ అడిగామని చెప్పారు.నిధుల దుర్వినియోగంపై అవినాష్‌ను సంజాయిషీ కోరామని, డేటా సొల్యూషన్స్ ప్రతినిధి రాజశేఖర్‌ను ప్రశ్నించినా సరైన సమాచారం ఇవ్వకుండా అవినాష్ కాలయాపన చేశారని వివరించారు. దీంతో రాజశేఖర్ ను అరెస్ట్ చేసి విచారణ జరిపామన్నారు. విచారణలో నిధులు దుర్వినియోగం చేసినట్లు అంగీకరించారని, అవినిష్ ఆస్తుల విషయమై సబ్ రిజిస్ట్రార్‌కు లేఖలు రాసినట్లు చెప్పారు.ఆస్తుల క్రయవిక్రయాలకు తావులేకుండా సబ్ రిజిస్ట్రార్‌కు లేఖలు రాశామని, త్వరలోనే నిందితుడు అవినాష్‌ను పట్టుకుంటామని, కొమ్మిరెడ్డి అవినాష్ మాజీ డీజీపీకి బంధువని ఐజీ పాలరాజు చెప్పారు.మరోవైపు నాలుగున్నేరుళ్లుగా ట్రాఫిక్ చలాన్ల సొమ్ము పోలీసు ఖాతాలకు జమ కాకపోయినా పోలీసులు ఎందుకు పట్టించుకోలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పోలీసు శాఖలోని సాంకేతిక విభాగాల్లో ఉన్న అధికారులకు కూడా ఈ వ్యవహారంలో ప్రమేయం ఉందని ఆరోపణలు ఉన్నాయి. మాజీ డీజీపీతో ఉన్న సన్నిహిత సంబంధాలతోనే ఈ వ్యవహారాన్ని చూసి చూడనట్టు వదిలేశారని చెబుతున్నారు. పేమెంట్ గేట్‌వేల నుంచి వసూలైన సొమ్మును నిర్దిష్ట వ్యవధిలోగా ప్రభుత్వ ఖాతాలకు చెల్లించకపోయినా ఏళ్ల తరబడి ఎందుకు కళ్లు మూసుకున్నారనే సందేహాలు ఉన్నాయి. ఈ అక్రమంలో ప్రస్తుతం సర్వీసులో ఉన్న ఐపీఎస్ అధికారుల ప్రమేయం కూడా ఉందనే గుసగుసలు వినిపిస్తున్నాయిఈ చలాన్ల టెండర్ల ప్రక్రియలో కీలకంగా వ్యవహరించిన అధికారులతో పాటు ఈ వ్యవహారాలను పర్యవేక్షించే అధికారులను కూడా ప్రశ్నిస్తే వాస్తవాలు వెలుగు చూస్తాయని చెబుతున్నారు. నిందితుల్ని కాపాడేందుకు ఉన్నత స్థాయిలో ప్రయత్నాలు జరుగుతున్నాయని చెబుతున్నారు. మరోవైపు మాజీ డీజపీ అధికార పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నారు. ఎన్నికల్లో ఎంత ఖర్చైనా భరించేందుకు సిద్ధమని ఇప్పటికే ముందుకు వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది.

## తాగునీటి సమస్యలు పరిష్కరించాలి




పెద్దకడబూరు అక్టోబరు 21:( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలం నౌలేకల్ గ్రామంలో తాగునీరు ఫిల్టర్ చేయకుండా 24 గ్రామాలకు అలాగే వదులుతున్నారు ఏ ఐ కె ఎస్ సిపిఐ ఆధ్వర్యంలో ఆదోని ఆర్డబ్ల్యూఎస్ డి ఆఫీసు ఎదుట ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ యాదవ్ సిపిఐ మండల కార్యదర్శి వీరేష్ పెద్దకడబూరు మండలం నౌలేకల్ గ్రామంలో తాగునీరు ఫిల్టర్ చేయకుండా 24 గ్రామాలకు అలాగే వదులుతున్నారు మరి మండలంలో ఏఈ సీటికే పరిమితమైతున్నారా వారన్నారు తాగినట్టు సమస్య గురించి ఏ ఒక్కరోజు కూడా ఆయన స్పందించింది లేదు వెంటనే పెద్ద కడుబూర ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ ని సస్పెండ్ చేయాలని మరి జెడ్పిటిసి మెంబర్ జాముకయ్య కాంట్రాక్టర్ ఐ ఉండి నీటిని శుద్ధి చేయకుండగా ట్రాక్టర్లకు 1000 1500 వసూలు చేయడానికి ఆయన ఉన్నాడు గానీ ప్రజల ప్రాణాలు అంటే లెక్కే లేదు అని వారన్నారు జమ్మూ ముకయ్య ని కాంటాక్ట్ నుంచి తొలగించాలని వారన్నారు అదేవిధంగా ఆదోని డి గారు సీటుకే పరిమితం కాకుండా గ్రామాల్లో పర్యటించాలని డి గారితో వాదనలకు దిగారు ఈ విషయంపై డి గారు స్పందించి ఖచ్చితంగా నౌలేకల్ ఉన్న ఆర్డబ్ల్యూఎస్ ద్వారా తాగినీటి సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని అన్నారు పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రం డి ఇ శ్రీనివాసులు ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో బికెయంయు కుమ్మరి చంద్ర రామాంజనేయులు వీరాంజనేయులు తిక్కన్న నాగరాజు నాగేష్ ఆంజనేయ నరసింహులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు

## బాబుతో నేను కార్యక్రమాన్ని జయప్రదం చేయండి



పెద్దకడబూరు అక్టోబరు 21 ( విభారె న్యూస్) పెద్దకడబూరు మండలంలో టీడీపీ రైతు విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకంతరెడ్డి మాట్లాడుతూ బాబుతో నేను కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శనివారం పెద్దకడబూరులో బాబుతో నేను కార్యక్రమం కరపత్రాలను విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వం రాజకీయ కక్షతోనే జైల్లో పెట్టింది అనే విషయాన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలకు వివరించాలని తెలిపారు. టీడీపీ నేతలు మల్లికార్జున, వీరేష్ గౌడు, నరసన్న, మహదేవ, బొగ్గుల నరసన్న టిడిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## శ్రీ రాజరాజేశ్వరి దేవిఅలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ కాళికామాత అమ్మవారు



అమ్మవారిని పూజ నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ ప్రతినిధి సెప్టెంబర్ 21 విభారె న్యూస్ :- ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ విశ్వరూప పారిశ్రామిక నగర్ లో కొలువుదిరిన శ్రీ కాళికామాత ఆలయంలో దసరా నవరాత్రులు శ్రీ కాళికామాత ఆలయ కమిటీ అధ్యక్షులు దురుగడ్డ రవీంద్రాచారి ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 7వ రోజు అయిన శనివారం శ్రీ కాళికామాత అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాజరాజేశ్వరి దేవి పూజకు ఎస్. సాయన్న ఆచారి దంపతులు, తునికి పాటి కోటేశ్వరరావు దంపతులు ఉభయ దారులుగా వ్యవహరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సోదరి సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొని శ్రీ కాళికా మాత అమ్మవారిని దర్శించుకున్నారు.

# రెవెన్యూ అంశాలలో నిర్దేశించిన లక్ష్యాన్ని చేధించండి

### జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21:-జిల్లాలో చేపట్టిన రీ సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టి వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ అన్ని మండలాల తాసిల్దార్లను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి రీ సర్వే, స్పందన గ్రీవెన్స్, ఆర్ఓఆర్ కేసులు, ఏపీ సేవా సర్వీసులు, మ్యుటేషన్ సేవలు, భూ సేకరణ పరాయీకరణ, వ్యవసాయ భూముల కేటాయింపు, ఇనామ్ సర్వీస్ భూములు, పౌరసరఫరాలు, కోర్టు కేసులు తదితర నిర్దేశిత రెవెన్యూ లక్ష్యాల సాధనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన రి సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని మండల తాసిల్దార్లను ఆదేశించారు. భూ వివాదాల డిస్ప్యూట్స్ కు సంబంధించి స్పందన కార్యక్రమంలో అనేక దరఖాస్తులు వస్తున్న నేపథ్యంలో సంబంధిత తాసిల్దారులు, వీఆర్వోలు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఆర్ఓఆర్ పెండింగ్ కేసులు, క్షేత్రస్థాయిలో అనుభవంలో ఉన్న కేసులను విశ్లేషించి మండలాల వారీగా వారం రోజుల్లో నివేదికలు ఇవ్వాలని మండల తాసిల్దార్లను కలెక్టర్ ఆదేశించారు. సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు నిర్దేశించిన రీ సర్వే కార్యక్రమాన్ని ప్రత్యేక శ్రద్ధతో నిశితంగా పరిశీలించి పూర్తి చేయాలన్నారు. సర్వే బృందాలు గ్రౌండ్ ట్రూతింగ్, గ్రౌండ్ వ్యాలిడేషన్, స్టోన్ ప్లాంటేషన్ తదితర ప్రక్రియలను ఆర్డీవోలు పరిశీలించాలన్నారు. జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఎ లోకి వెళ్తున్నాయని పలుమార్లు సూచించినప్పటికీ సంబంధిత తాసిల్దారులు, వీఆర్వోలు అశ్రద్ధ చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. పెండింగ్ లో ఉన్న మ్యుటేషన్ దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. జాతీయ రహదారులకు సంబంధించి పెండింగ్లో ఉన్న గ్రామాల అవార్డ్స్ ను పాస్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత మండల తాసిల్దార్ లను ఆదేశించారు. ప్రజా పంపిణీ వ్యవస్థకు సంబంధించి నిత్యావసర సరుకుల పంపిణీలో ఎలాంటి లోపాలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన రెవిన్యూ అంశాలను కాల పరిమితి లోపు పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో, అంకితభావంతో పనిచేయాలని అన్ని మండలాల తాసిల్దారులను ఆదేశించారు. ఈ సమావేశంలో లో డిఆర్ఓ పుల్లయ్య, సంబంధిత డివిజన్, మండలాల ఆర్డీవోలు, తాసీల్దార్లు, సెక్షన్ సూపరింటెండెంట్ లు, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

## నంద్యాల ఫ్రూట్ మార్కెట్ అగ్ని ప్రమాద బాధితులకు 23లక్షల చెక్ లను అందజేసిన మంత్రి బుగ్గన



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్ 21:-నంద్యాల పట్టణం గాంధీ చౌక్ ఫ్రూట్ మార్కెట్ నందు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన 14 మంది బాధిత వ్యాపారులకు శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి 23లక్షల 45వేల రూపాయల విలువగల చెక్కులను అందజేశారు. వీరితో పాటు నంద్యాల ఎమ్మెల్యే శిల్పారవిరెడ్డి , ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాష, ఎమ్మెల్యే రాంభూపాల్ రెడ్డి , రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖ ప్రభుత్వ సలహాదారు హబిబుల్లా, జిల్లా కలెక్టర్ డా. మనజీర్ జిలాని సమున్, జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి, మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నీసా, వెజిటబుల్ అండ్ ఫ్రూట్ మార్కెట్ అసోసియేషన్ ప్రతినిధి కలాం, సభ్యులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహ న్రెడ్డికి, మంత్రి బుగ్గన రాంజేంధ్రనాథరెడ్డి, ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలకు లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు. నంద్యాల ఫ్రూట్ మార్కెట్ నందు జరిగిన భారీ అగ్నిప్రమాదంలో వ్యాపారస్తులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని ప్రభుత్వానికి తెలియజేసి కొంత మేర నష్టపరిహారాన్ని అందించడం జరిగిందని మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి ప్రభాకర్, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ పురుషోత్తంరెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## శ్రీ అరుల్ మిగు భువనేశ్వరి దేవి అలంకారము లో దర్శనమిచ్చిన శ్రీ వాసవి మాత.



ఎమ్మిగనూరు అక్టోబర్ 21 విభారె న్యూస్..దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా 7వ రోజు అయిన శనివారం రోజు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం లో శ్రీ వాసవి మాత శ్రీ అరుల్ మిగు భువనేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతిరోజు ఉదయాన్నే శ్రీ నగరేశ్వర స్వామి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కుంకుమార్చన, లలితా సహస్రనామార్చన వివిధ రకాల పూజలను ఆలయ ప్రధాన అర్చకులు కే.ఎల్ నరసింహారావు వారిచే నిర్వహించబడును. పూజ అనంతరం తీర్థ ప్రసాద వితరణము జరుగును. సాయంకాలము రోజుకు ఒక అలంకారముతో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారిని అలంకరణ చేస్తున్నారు. అలంకారము అంతయు శ్రీ వాసవి పూజా సమితి వారిచే నిర్వహించబడును. అమ్మవారిని దర్శించుకునేందుకు సాయంకాలం భక్తులు తండోపతండాలుగా వచ్చి దర్శించుకుంటున్నారు. భక్తులకు ప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు.

## రంగస్థల కళాకారినులకు దసరా కానుక చీరల పంపిణీ ...



కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయదశమి దసరా పండుగ శుభ సందర్భంగా కర్నూలు జిల్లా సుప్రసిద్ధ రంగస్థల మహిళా కళాకారినులకు విజయదశమి దసరా కానుక చీరల పంపిణీ కార్యక్రమం ఈరోజు కర్నూలు నగరం నందలి పింగళి సూరన్న తెలుగు తోట నందు టీజీవి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య కర్నూలు జిల్లా రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు జి అంకయ్య చీరల పంపిణీ ప్రదాత బైలుప్పల షఫీయుల్లా పి హనుమంతరావు చౌదరితెలుగు భాష ఉద్యమ నాయకులు జె ఎస్ ఆర్ కె శర్మ ముఖ్య అతిథులుగా పాల్గొని రంగస్థల మహిళా కళాకారులు శ్రీమతి అరుణకుమారి శ్రీమతి రాధిక నిర్మలా ప్రియదర్శిని శోభారాణి అరుణ లక్ష్మి ప్రసన్న మంజుల జ్యోతి శారదా శ్రీమతి రేణుక రాజ్యలక్ష్మి పద్మావతి కమలమ్మ చంద్రకళ మౌనిక ప్రముఖ రంగస్థల మహిళ కళాకారులకు దసరా కానుక చీరల పంపిణీ అంద చేయడం జరిగింది. కళామతల్లి సేవలో రంగస్థలానికి విశిష్ట సేవలందిస్తున్న గౌరవనీయ పెద్దలు పత్తి ఓబులయ్య గారికి పి హనుమంతరావు చౌదరి ఘనంగా సన్మానించారు. కర్నూలు జిల్లా మహిళా కళాకారులు రాష్ట్రస్థాయి జాతీయస్థాయి గుర్తింపు పొంది రజినీబాయి ఆదర్శంగా పోటీపడి మహానటి గా గుర్తింపు పొందాలని ఈ వస్త్రదాన కార్యక్రమంలో కర్నూలు కళాకారులు గజల్ గాయకులు మహమ్మద్ మియా పి హనుమంతరావు చౌదరి డాక్టర్ ఎస్ జి ఎన్ సుభాన్ గారు మహిళా కళాకారులు కర్నూలు జిల్లాకు కీర్తి ప్రతిష్టలు తేవాలని అన్నారు. ఈ వస్త్రదాన కార్యక్రమంలో కర్నూలు కళాకారులు సయ్యద్ రోషన్అలీ సిబి అజయ్ కుమార్ పి దస్తగిరి గాయకులు మహమ్మద్ మియా మంజుల రామకృష్ణ టీ రాజశేఖర్ డి పుల్లయ్య కళాప్రియ తిరుపాలు డి యన్ వి సుబ్బయ్య ఎం మనోహర్ బాబు వివి రమణాచారి డి పుల్లయ్య డి పార్వతి గాండ్ల లక్ష్మన్న రంగస్థల మహిళా కళాకారుల సమక్షంలో వస్త్ర పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమం వస్త్ర ప్రదాత బీలుప్పల షఫీయుల్లా గారికి ముఖ్య అతిధులు విశ్రాంత తహసిల్దార్ ప్రముఖ న్యాయవాది సిబి అజయ్ కుమార్ గారు అభినందనలు తెలియజేశారు. దీపావళి పండుగ కానుకగా మహిళా కళాకారులకు తన పూర్తి సహాయ సహకారంతో వస్త్రదాన కార్యక్రమం నిర్వహిస్తానని గౌరవనీయ కళాకారులు రచయిత డాక్టర్ ఎస్ జి యం సుభాన్ సాహెబ్ సభాముఖంగా తెలియజేశారు. కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారులు కళాభిమానులు దసరా కానుక చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు...

## ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలి.




ఎమ్మిగనూరు టౌన్, అక్టోబర్, 21 విభారె న్యూస్: -ఏఐటీయూసీ 14వ వ్యవస్థాపక దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సంఘం నియోజకవర్గ అధ్యక్షులు యు. వీరేష్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప,సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన గౌడ్, పట్టణ కార్యదర్శి రంగన్న, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మ గురుడు పాల్గొన్నారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ, కార్మిక సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని అన్నారు. రైతు సంఘాల ఆధ్వర్యంలో నవంబర్ 27,28 తేదీలలో చలో రాజభవన్, మహా ధర్నా కార్యక్రమాన్ని చేపట్టామని, ధర్నాకు మద్దతుగా పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి విజయేంద్ర ,నరసింహులు,వీరేశు, రామాంజిగౌడ్ ,శివా,సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

### ప్రముఖ శైవ క్షేత్రం శ్రీకాళహస్తి లో మార్కెట్ ప్రసాద్



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి అక్టోబర్21:-దసరా శరన్నవరాత్రులసందర్భంగా తిరుపతిజిల్లాలో ప్రముఖ శైవ క్షేత్రంశ్రీకాళహస్తియందు శ్రీకాళహస్తీశ్వరుని గత 16 సంవత్సరాల నుంచి మహా శివ రాత్రి బ్రహ్మోత్సవాల్లో టన్నుల కొద్ది కూరగాయలు వితరణ చేస్తున్న నంద్యాల మార్కెట్ ప్రసాద్ శనివారం నాడు దర్శించుకున్నారు. ఆలయసూపరింటెండెంట్నాగభూషణం సగర్వంగా స్వాగతంపలికిస్వామి వారి దర్శనం చేయించి తీర్థ ప్రసాదాలు అంద జేశారు. శాలువతో మార్కెట్ ప్రసాద్ ను సన్మానించారు . .

### పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా రక్తదానం. - పి.శ్రీనివాస్ సిఐడి, డిఎస్పి ఆధ్వర్యంలో..



కర్నూలు జిల్లా ప్రతినిధి అక్టోబర్ 21 విభారె న్యూస్.పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవము సందర్భంగా తేది :21-10-2023 వ తేదీన కర్నూల్ సిఐడి ప్రాంతీయ కార్యాలయము నందు పి. శ్రీనివాస్, డి.ఎస్.పి/ఇన్చార్జి రీజినల్ ఆఫీసర్, సిఐడి, కర్నూలు వారి ఆద్వర్యములో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, కర్నూలు కి చెందిన డాక్టర్. రామచంద్రా రావు,మెడికల్ ఆఫీసర్, వారి పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరములో సి.ఐ.డి. అధికారులు,వారి సిబ్బంది,వారి కుటుంబ సభ్యులు పాల్గొని రక్త దానం చేయడమైనది.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**